# గజ్వేల్ క్యాడర్‌లో జోష్

- ఆత్మవిశ్వాసాన్ని నింపిన సీఎం కేసీఆర్ ప్రసంగం
- బూత్‌స్థాయి సమావేశంతో బీఆర్ఎస్ కార్యకర్తల్లో నూతనోత్సాహం
- జై కేసీఆర్ అంటూ మార్మోగిన నినాదాలు
- నర్సాపూర్, మెదక్‌లోనూ గజ్వేల్ నాయకులే గెలిపించాలని దిశానిర్దేశం
- గజ్వేల్‌ను మరింత అభివృద్ధి చేసుకుందామని పిలుపు



ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావుకు తిలకం దిద్దుతున్న బీఆర్ఎస్ మహిళా కార్యకర్త

గజ్వేల్ అర్బన్, అక్టోబర్ 20: బూత్ స్థాయి సమావేశంతో బీఆర్ఎస్ కార్యకర్తల్లో ఉత్సాహం ఉప్పొంగింది. గజ్వేల్ నియోజకవర్గ స్థాయి బూత్‌లెవల్ కార్యకర్తల సమావేశాన్ని శుక్రవారం అంతాయిపల్లిలోని ఎస్ఎన్ఆర్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. ఈ సమావేశంలో సీఎం కేసీఆర్ చేసిన ప్రసంగం బీఆర్ఎస్ కార్యకర్తల్లో నూతనోత్సాహాన్ని నింపింది. తెలంగాణ ఏర్పాటుకు ముందు ఈ ప్రాంత కష్టాలు, కన్నీళ్లు, రైతులు పడ్డ గోసను, తెలంగాణ ఏర్పాటు అవసరాన్ని, ఉద్యమ ప్రారంభమైన విధానాన్ని సీఎం కేసీఆర్ కార్యకర్తలకు మరోసారి గుర్తు చేశారు. ఏది ఏమైనా తెలంగాణ రైతులు, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలన్న ఏకైక లక్ష్యంతో బీఆర్ఎస్ పనిచేస్తున్నట్లు స్పష్టం చేశారు. గజ్వేల్ నాయకులు, కార్యకర్తలు కేవలం గజ్వేల్ అసెంబ్లీ నియోజకవర్గంలో బీఆర్ఎస్‌ను గెలిపించడమే కాకుండా నర్సాపూర్, మెదక్‌లోనూ బీఆర్ఎస్ గెలుపునకు కృషిచేయాలని పిలుపునిచ్చారు. వేలసంఖ్యలో బైక్‌లపై ర్యాలీగా నర్సాపూర్, మెదక్‌కు వెళ్లాలని సీఎం సూచించారు. సీఎం కేసీఆర్ చేసిన దిశానిర్దేశం కార్యకర్తల్లో కొత్త ఉత్సాహం, ఆత్మవిశ్వాసాన్ని నింపింది. సీఎం కేసీఆర్‌ను దగ్గరగా చూడడం, తమను ఉద్దేశించి ప్రసంగించడంతో కార్యకర్తలు సంతోషపడ్డారు. అనుకున్న దానికన్నా నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో రావడంతో సమావేశం హాలు మొత్తం కిక్కిరిసిపోయింది. తిరిగి వెళ్తున్న కార్యకర్తల్లో ఎంతో సంతృప్తి, ఉత్సాహం కనబడింది.

### ముదిరాజ్‌లకు సీఎం పెద్దపీట వేశారు

ముదిరాజ్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొట్టాల యాదగిరి మాట్లాడుతూ.. ముదిరాజ్‌లను, బీసీ సబ్బండ వర్గాలను ఏ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. సీఎం కేసీఆర్ సబ్బండ వర్గాల సంక్షేమానికి పెద్దపీట వేసినట్లు తెలిపారు. 2014కు ముందు తెలంగాణలో 3వేల మత్స్య సహకార సొసైటీలు ఉంటే, 6వేల సొసైటీలను తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ఈ సొసైటీల ద్వారా 4లక్షల మంది మత్స్యకారులు లబ్ధి పొందారన్నారు. త్వరలో మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ ప్రాజెక్టుల్లో మత్స్యకారులకు చేపలు పట్టడానికి లైసెన్సులు ఇవ్వనున్నట్లు తెలిపారు. పోలీస్ కిష్టయ్య అమరుడైన తర్వాత ఆయన కుమార్తెను సీఎం కేసీఆర్ సొంత ఖర్చుతో చదివించి డాక్టర్‌ను చేశారని, ప్రస్తుతం ఆ అమ్మాయి మెడిసిన్‌లో పీజీ చేస్తున్నట్లు తెలిపారు. దీనికి సీఎం కేసీఆర్ సహాయ సహకారాలు అందిస్తున్నారని తెలిపారు. మూడోసారి కేసీఆర్ సీఎం అయితే సబ్బండ వర్గాలు ఆర్థికంగా, రాజకీయంగా మరింత బలోపేతం అవుతారని చెప్పగానే కార్యకర్తల నుంచి జైకేసీఆర్ అంటూ నినాదాలు వినిపించాయి.



సీఎం కేసీఆర్‌కు దట్టీ కడుతున్న బీఆర్ఎస్ నాయకుడు



బీఆర్ఎస్ నేతతో సీఎం కేసీఆర్ కరచాలనం



సీఎం కేసీఆర్‌కు నమస్కరిస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి

## సీఎం కేసీఆర్‌కు నాగలి బహూకరణ

కొండపాక(కుకునూరుపల్లి), 20: గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు ముఖ్యనాయకులతో శుక్రవారం మేడ్చల్ జిల్లా అంతాయపల్లిలోని ఎస్ఎన్ఆర్ ఫంక్షన్ హాల్‌లో సీఎం కేసీఆర్ సమావేశమయ్యారు. కార్యక్రమానికి హాజరైన రైతుబంధు రాష్ట్ర సమితి సభ్యుడు దేవీరవీందర్ సీఎం కేసీఆర్‌కు నాగలి బహూకరించారు.







సీడీని ఆవిష్కరిస్తున్న సీఎం కేసీఆర్, వంటేరు ప్రతాప్‌రెడ్డి, తదితరులు, బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు



సీఎం కేసీఆర్‌కు నాగలి బహూకరిస్తున్న రైతుబంధు సమితి రాష్ట్ర సభ్యుడు దేవీరవీందర్

# తొలి సీఎంను అందించిన ఘనత గజ్వేల్‌దే..

- ప్రయోగశాలగా మారిన నియోజకవర్గం
- కేంద్ర మంత్రిగా కేసీఆర్ రైల్వే లైన్ మంజూరు చేయించారు
- తెలంగాణ రాష్ట్రానికి గజ్వేల్‌ను మార్గదర్శిగా తీర్చిదిద్దారు
- ఆర్థిక, వైద్యారోగ్యల శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు




సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు



నినాదాలు చేస్తున్న ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ శ్రేణులు

గజ్వేల్, అక్టోబర్ 20: గజ్వేల్ కొత్త చరిత్రను తిరగరాయాలి. గజ్వేల్‌లో గెలిచిన పార్టీనే రాష్ట్రంలో అధికారంలోకి రాబోతుందని, తెలంగాణ రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిని అందించిన ఘనత మీకే దక్కుతుందని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్యల శాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం గజ్వేల్ నియోజకవర్గస్థాయి కార్యకర్తల సమావేశం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అంతాయిపల్లిలోని ఎస్ఎన్ఆర్ గార్డెన్స్‌లో జరిగింది. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశానికి తలమానికంగా ఉన్న మిషన్ భగీరథను ప్రధాని చేతుల మీదుగా ప్రారంభించుకున్న ఘనత మీదే అన్నారు. అభివృద్ధిలో గజ్వేల్ ప్రయోగశాలగా మారిందన్నారు. దేశ విదేశాల నుంచి గజ్వేల్‌కు వచ్చి అభివృద్ధిని చూసి పోతున్నారన్నారు. కొండపోచమ్మ, మల్లన్నసాగర్ ప్రాజెక్టుల నిర్మాణాలతో ఎండిపోయిన చెరువులు నిండుకుండల్లా మారాయన్నారు. అడవుల పునరుజ్జీవనం చేయడం, ఆర్డీవో కార్యాలయం, 30 ఏండ్ల కుకునూర్‌పల్లి మండల కేంద్రం ఏర్పాటుతోపాటు మనోహరాబాద్, మర్కూక్ మండలాలను ఏర్పాటు చేసుకొని అభివృద్ధి చేసుకుంటున్నామన్నారు. కేంద్ర మంత్రిగా కేసీఆర్ ఉన్న సమయంలో రైల్వే లైన్ మంజూరు చేయించగా అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం భూసేకరణ చేయలేదన్నారు. సీఎం కేసీఆర్ నిధులిచ్చి రైల్వే లైన్ పూర్తి చేయించడంతో నేడు రైలు కల సాకారం అయిందన్నారు. నాచారం, కొడకండ్ల, లకుడారం, దుద్దెడ ప్రాంతాల వద్ద స్టేషన్ ఏర్పాటుతో ప్రజలకు మేలు జరుగుతున్నదన్నారు. కేసీఆర్ లేకుంటే రైలు వచ్చేది కాదన్నారు. గజ్వేల్‌లో వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఫారెస్టు కళాశాల, అద్భుతంగా ప్రభుత్వ దవాఖాన, మార్కెట్‌ను నిర్మించుకున్నమన్నారు. ఎర్రటి ఎండల్లో హల్దీ, కూడవెల్లి వాగులు నిండుకుండలా మత్తళ్లు దుంకుతున్నాయన్నారు. రింగ్ రోడ్డుపై పోతుంటే ఎయిర్‌పోర్టుకు వెళ్తున్నట్లు ఉందన్నారు. తాగునీటి ఇబ్బందులు తీరాయని తెలిపారు. గజ్వేల్‌ను తెలంగాణకు మార్గదర్శిగా చేశారని, గజ్వేల్‌కు వచ్చే పోస్టు కార్డు గద్వాల్‌కు పోయే రోజులను చూశామని, నేడు గజ్వేల్ పేరు చరిత్రలో నిలిచిందన్నారు. ప్రతి కార్యకర్త 35రోజుల పాటు కష్టపడి పనిచేసి రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీ కేసీఆర్‌కు ఇవ్వాలని పిలుపునిచ్చారు. ప్రతిపక్షాలకు మాట్లాడే నైతికత లేదన్నారు. గజ్వేల్‌లో ఊర్లకు ఊర్లే కేసీఆర్‌కు మద్దతుగా ఏకగ్రీవ తీర్మానాలు చేస్తున్నాయని చెప్పారు. కుల సంఘాలు, అసోసియేషన్లు ముందుకొస్తున్నాయన్నారు. సమన్వయంతో పని చేసి భారీ మెజార్టీ ఇవ్వాలన్నారు.